క్లుప్తంగా

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



కామారెడ్డి టౌన్ : ఈనెల 20వ తేదీన తలపెట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీ. ప్రభాకర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక పాలనలో కార్మికుల జీవన ప్రమాణాలు పడిపోయాయన్నారు. అలాగే ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంబంధించి వాల్ పోస్టర్లను ఏఐటీయూసీ, మెడికల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి పి. రామకృష్ణ, టీయూసీఐ రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఒరిజినల్ బిల్ ఇవ్వాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): రైతులకు ఒరిజినల్ బిల్ ఇవ్వాలని ఫర్టిలైజర్ షాపు నిర్వాహకులకు ఏడీఏ అమీనా సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ షాపులను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని తెలిపారు. అనంతరం వ్యవసాయ సహకార సంఘంలో స్టాక్ రికార్డులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో దివ్యాంగులకు వీల్‌చైర్ల పంపిణీ



కామారెడ్డి అర్బన్: రోటరీ క్లబ్ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా దివ్యాంగులకు వీల్ చైర్లను అందించడం అభినందనీయమని రవాణా శాఖ జిల్లా అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక విద్యానగర్‌లోని రోటరీ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో శెట్‌పల్లి సంగారెడ్డి, కొర్పోల్, మోతే, ధర్మారావుపేట గ్రామాలకు చెందిన ఐదుగురు దివ్యాంగులకు వీల్‌చైర్లను అందజేశారు. రోటరీ క్లబ్, షార్ ప్రాజెక్ట్, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్, పిడుగురాళ్ల లైమ్ సిటీ రోటరీ క్లబ్ ఆర్థిక సహాయం వీల్‌చైర్లను అందిస్తున్నట్టు కామారెడ్డి రోటరీ అధ్యక్షుడు పి.రాజనర్సింహారెడ్డి అన్నారు. కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఎలక్ట్ ఎం.జైపాల్ రెడ్డి, ప్రతినిధులు కృష్ణహరి, సుభాష్‌చంద్‌జైన్, కాశీనాథం, శంకర్, సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద మున్సిపాలిటీ వార్డుల విభజనపై సమీక్ష



బిచ్కుంద(జుక్కల్): బిచ్కుంద గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా ప్రభుత్వం ప్రకటించి జీవో విడుదల చేసిన విషయం తెలిసిందే. మున్సిపాలిటీలో గోపన్‌పల్లి, దౌల్తాపూర్, కందర్‌పల్లి జీపీలను విలీనం చేశారు. మంగళవారం కామారెడ్డి మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి గిరిధర్ కుమార్, కార్యదర్శులు సమావేశమై కౌన్సిలర్ వార్డుల విభజన పై సమీక్ష సమావేశం నిర్వహించారు. జనాభా ప్రాతిపదికన జీపీలలో ఎన్ని వార్డులు ఉన్నాయి ఓటరులు ఎంత మంది ఉన్నారని పరిశీలిస్తున్నామన్నారు. బిచ్కుంద మున్సిపాలిటీ పరిధిలో 12 కౌన్సిలర్ వార్డులు ఉండనున్నట్లు, పూర్తిగా విచారణ చేపట్టిపై అధికారులకు నివేదిక పంపిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శులు శ్రీనివాస్‌గౌడ్, పూజా, హరీష్ తదితరులున్నారు.

ప్రైవేటుకు దీటుగా విద్యాబోధన

మాచారెడ్డి: ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన చేస్తామని పాల్వంచ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవర్ధన్ రెడ్డి అన్నారు. మంగళవారం బడిబాటలో భాగంగా గ్రామంలోని మహిళా సంఘం సభ్యులతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్యాబోధన చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గ్రామస్తులు మహిళా సంఘం సభ్యులు ఉన్నారు.

21 గ్రామాలకు రెండు ఆస్పత్రులు

- కామారెడ్డి మండలంలో పశువైద్య సిబ్బంది కొరత
- మృత్యువాత పడుతున్న మూగజీవాలు
- ఇబ్బందులు పడుతున్న పశుపోషకులు



రామేశ్వర్‌పల్లిలో పశువైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది (ఫైల్)

కామారెడ్డి రూరల్: పశువైద్యశాలల్లో వైద్య సిబ్బంది కొరత కారణంగా పశుపోషణపై ఆధారపడిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జీవాలకు జబ్బుచేస్తే నయం చేసేందుకు డాక్టర్లు కరువయ్యారు. సిబ్బంది కొరత పాడి పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

ఖాళీగా ఏడీ పోస్టు..

మండలంలో 14 గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలో విలీనమైన 7 గ్రామాలు ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని వీక్లీ మార్కెట్‌లో, గర్గుల్ గ్రామంలో మాత్రమే పశువైద్యశాలలున్నాయి. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఏడీ పోస్టు ఉండగా ఓఎస్ ఆఫీస్ సబార్డినేటర్ సూర్యలింగం నిజామాబాద్ నుంచి డిప్యూటేషన్‌పై కామారెడ్డికి వచ్చి కామారెడ్డి పశువైద్యశాలలో పశువులకు వైద్య సేవలు అందిస్తున్నారు. గర్గుల్ గ్రామంలోని పశువైద్యశాలలో గ్రామీణ ప్రాంతాల్లో డాక్టర్ రవికిరణ్ పర్యవేక్షణలో ముగ్గురు గోపాలమిత్రల ఆధ్వర్యంలో పశువులకు వైద్యసేవలు అందుతాయి.

50 వేల పశువులకు అందని వైద్యం

మండలంలోని అన్ని గ్రామాల్లో మొత్తం పశువులు, గొర్రెలు, మేకలు, తదితర కలిపి దాదాపు యాభై వేలున్నాయి. ఇందులో గొర్రెలు, మేకలు 26,000, గోజాతి పశువులు 6,379, గేదెజాతి పశువులు 6,821, కోళ్లు 10,800 వరకు ఉన్నాయి. మూగజీవాలకు సకాలంలో వైద్యం అం దడం లేదు, కామారెడ్డి జిల్లా కేంద్రానికి 8 నుంచి 12 కిలోమీటర్లు ఉన్న గూడెం, తిమ్మక్‌పల్లి, లింగాయిపల్లి, గ్రామాల్లో పశువులకు ఏదైనా రోగం వస్తే వాటిని తీసుకుని వైద్యశాలకు వచ్చేలోపు చనిపో తున్నాయి. గ్రామానికి ఒక్క పశువైద్యశాలను ఏర్పాటు చేయాలని పశుపోషకులు కోరుతున్నారు.

సరిపోని బడ్జెట్.. అరకొర మందులతో....

మండలంలోని ఆయా గ్రామాల్లో అరకొర మందులతో పశువైద్యశాలలు కొనసాగు తున్నాయి. కామారెడ్డి, గర్గుల్ పశువైద్యశాలలకు రూ.50,000 వేల చొప్పున ఏటా మందులు సరఫరా చేస్తున్నారు. ఈ బడ్జెట్ పశువులకు వచ్చే జబ్బులకు సరిపోవడం లేదు. దీంతో డాక్టర్లు ఉన్న మందులను ఇస్తూ మిగిలిన వాటికి రెఫర్ చేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కేటాయించిన బడ్జెట్‌ను ప్రస్తుతం కొనసాగించడంపై పాడిరైతుల నుంచి విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. బడ్జెట్‌నుపెంచకపోవడం, అరకొర మందులు సరఫరాతో రైతులు పశువులకయ్యే వైద్య ఖర్చులు భరించాల్సి వస్తోంది. ఇకనైనా ప్రభుత్వం బడ్జెట్‌ను పెంచాలని రైతులు కోరుతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలోపంతో కొందరు పశువైద్య సిబ్బంది సమయపాలన పాటించడంలేదని రైతుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. చిటుకు రోగంతో గొర్రెలు, మేకలు, గాలికుంటు వ్యాధులతో మృత్యువాత పడుతున్న పశువులు.. ఏటా సీజన్లో మృత్యువాత పడుతున్నాయి.. గతేడాది కాలంలో చిటుకురోగంతో గొర్లు, మేకలు, గాలికుంటు, ఇతర రోగాలతో పాడి, ఇతర లోకల్ జాతి పశువులు దాదాపు దాదాపు 200. నుంచి 300 వరకు మృతి చెందినట్లు గొర్లకాపరులు, పాడిరైతులు ఆరోపిస్తున్నారు.

ఎప్పటికప్పుడు చికిత్స



ఏటా ఆయా సీజన్లు వచ్చాయంటే గొర్లు, మేకల ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలందిస్తున్నాం. గాలికుంటు, ఇతర వ్యాధులకు ఎప్పటికప్పుడు చికిత్స చేస్తున్నాం. ఉన్న బడ్జెట్, ఆస్పత్రుల్లో ఉన్న మందులను పశువులకు అందిస్తూ వైద్యసేవలు అందిస్తున్నాం.

– రవికిరణ్, కామారెడ్డి మండల పశువైద్యాధికారి

తాగునీటి వృథాకు చెక్



బీబీపేట ఎస్సీ కాలనీ వద్ద వాటర్ ట్యాంకుకు పైపును అమర్చిన సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్...

బీబీపేట : తాగునీటి ట్యాంకు నిండి వృథాగా పోతున్న నీటికి జిల్లా అధికారులు చెక్ పెట్టారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో వాటర్ ట్యాంకు నిండి నీరు వృథా పోవడం, అదే నీటి కింద గేదే సేద తీరడం పై 'తాగునీరు వృథా, గేదెకు ఉపశమనం' అనే శీర్షికన మంగళవారం ప్రచురితమైన కథనానికి మిషన్ భగీరథ అధికారులతో పాటు జిల్లా అధికారులు స్పందించారు. ఉదయాన్నే స్థానిక కార్యదర్శి రమేష్ వద్ద వివరాలు తెలుసుకున్నారు. ఒకే సమయంలో బోరు మోటార్ల నీరు, మిషన్ భగీరథ నీరు రావడం వల్ల ట్యాంకు నిండి వృథాగా పోయినట్లు తెలిపారు. దీంతో అక్కడ వృథాగా పోతున్న నీటి పైపు కు మరో పైపు బిగించారు. ప్రతి కాలనీలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు సైతం చేపడుతున్నట్లు మిషన్ భగీరథ డీఈ రమేష్ తెలిపారు. ఆయన వెంట ఏఈ రజిత, శిరీష, ఎంపీడీవో పూర్ణ చంద్రోదయ కుమార్, ఎంపీవో అబ్బాగౌడ్, సిబ్బంది ఉన్నారు.

రోడ్డును శుభ్రం చేసిన పారిశుధ్య కార్మికులు



బాన్సువాడ రూరల్: 'మహిళలే పారిశుధ్య కార్మికులు' శీర్షికన మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని హన్మాజీపేట్ గ్రామంలో చిన్నపాటి వర్షానికే రోడ్డుపై ఇళ్ల ముందు చేరిన చెత్తాచెదారం, మురికిని శుభ్రం చేయించారు. మురికి కాలువలపై అరుగులు ఉండటంతో పారిశుధ్య కార్మికులు శుభ్రం చేయలేకపోతున్నారని పంచాయతీ కార్యదర్శి రాజేష్ అన్నారు. గ్రామంలో మురికి కాలువలపై అక్రమణలు, అరుగులను తొలగించాలని నోటీసులు ఇస్తామన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి కృషి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని భూంపల్లి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను మంగళవారం జెడ్పీ సీఈవో, మండల ప్రత్యేకాధికారి చందర్ నాయక్ పరిష్కరించారు. గత కొన్ని రోజులుగా నీటి సమస్య తీవ్రంగా ఉండడంతో పరిశీలించి పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

బోరు మోటారు ప్రారంభం



మాచారెడ్డి: మండలంలోని సోమవారం పేటలో మంగళవారం బోరు మోటర్ ను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. గ్రామంలో నెలకొన్న నీటి ఎద్దడి గురించి ప్రభుత్వ సలహాదారు సభ్యులు సంప్రదించగా బోరు మోటర్ మంజూరు చేసినట్లు గ్రామ ప్రజలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నౌసీలాల్, నాయకులు నారా గౌడ్, గణేష్ నాయక్, శ్రీను, రవీందర్ నాయక్ సతీష్ నరసయ్య దేవరాజు, కరోబార్ ప్రకాష్ ఉన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రాజు

కామారెడ్డి రూరల్: ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాలను మెరుగుపర్చుకొని విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించాలని జిల్లా విద్యాశాఖాధికారి రాజు సూచించారు. మంగళవారం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో టీచర్లకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా మండలస్థాయిలో నిర్వహించే శిక్షణా కార్యక్రమాలకు ఆర్పీలుగా వ్యవహరిస్తున్నటువంటి 200 మందికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దేవునిపల్లిలో శిక్షణ కార్యక్రమాలను జిల్లా విద్యాశాఖ అధికారి రాజు ప్రారంభించారు. మీ మండలాలలో టీచర్స్‌కు చక్కగా శిక్షణను అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ పాఠశాల హెచ్‌ఎం గంగ కిషన్, కోఆర్డినేటర్స్ వేణు శర్మ, రిసోర్స్ పర్సన్‌లు భవాని, రజిత, హరిప్రసాద్, హరిచంద్ర, సురేందర్, శ్రీకాంత్, ఆనంద్, లింబాద్రి, 25 మండలాలకు సంబంధించిన ఆర్పీలుగా వ్యవహరిస్తున్నటువంటి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్కండేయ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



గాంధారిలో కలశాల ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

గాంధారి : మండల కేంద్రంలోని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నారాయణ గిరి వద్ద శివ భక్త మార్కండేయ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా రెండో రోజు మంగళవారం కొనసాగాయి. సంఘ భవనం నుంచి మహిళ భక్తులు ఏకరూప దుస్తులు ధరించి కలశాలను నెత్తిన బెట్టుకొని ఊరేగింపుగా మార్కండేయ ఆలయానికి చేరుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం, భజన కార్యక్రమాలు చేపట్టారు. సంఘ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

స్థల వివాదంపై డీఎల్‌పీవో విచారణ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో శ్రీనివాస్

దోమకొండ: మండల కేంద్రంలోని పాత సిండికేట్ బ్యాంక్ వద్ద స్థల వివాదంపై మంగళవారం కామారెడ్డి డీఎల్‌పీవో శ్రీనివాస్ విచారణ చేశారు. అక్కడి స్థలంలో నూతనంగా నిర్మాణాలకు గ్రామ పంచాయతీ కార్యదర్శి యాదగిరి అనుమతి ఇవ్వగా దీనిపై మాజీ జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో డీఎల్‌పీవో శ్రీనివాస్ విచారణ చేశారు. సదరు స్థల యజమాని ప్రతాప్‌రెడ్డికి నూతనంగా నిర్మాణాలకు పంచాయతీ పర్మిషన్ రూల్స్ ప్రకారం ఇవ్వడం జరుగుతుందన్నారు. వారి డాక్యుమెంట్లు గ్రామ పంచాయతీ రికార్డుల ఆధారంగా పర్మిషన్ ఇచ్చామన్నారు. ఈ విషయంలో మాజీ జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్ కోర్టులో పిటిషన్ వేశారన్నారు. ఇప్పటివరకు కోర్టు నుంచి నిర్మాణాలు చేయవద్దని ఎలాంటి ఆదేశాలు రాలేదన్నారు. స్థల వివాదం డాక్యుమెంట్ల విషయంలో ప్రతాప్ రెడ్డికి నోటీసులు ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శికి డీఎల్‌పీవో శ్రీనివాస్ సూచించారు. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తదితరులున్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లో తీసుకెళ్లండి

- పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు
- కార్యకర్తల సమావేశంలో జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు



బిచ్కుందలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

బిచ్కుంద(జుక్కల్): సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సూచించారు. మంగళవారం బిచ్కుందలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులు, తాగునీరు ఇతర సమస్యలను వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. అర్హులైన లబ్ధిదారులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. డ్వాక్రా సంఘంలోని సభ్యులకు ఇందిరమ్మ ఇళ్లు కట్టుకోవడానికి బ్యాంకు లింకేజీ ద్వారా లక్ష రుణం అందిస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అర్హులకు 'రాజీవ్ యువ వికాసం' లబ్ధి

రాజీవ్ యువ వికాసం పథకం కింద అర్హులైన వారికి రాయితీ రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ పథకంతో నిరుద్యోగ యువకులకు ఉపాధి లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గంగాధర్, ఏఎంసీ వైస్ చైర్మన్ శంకర్ పటేల్, నాయకులు విఠల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నాగ్‌నాథ్, గోపాల్‌రెడ్డి, నాగ్‌నాథ్ పటేల్, రవి పటేల్, సోపాన్, తుకారాం పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేసిన ఎమ్మెల్యే

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలం గున్కుల్ గ్రామంలో రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవాలయాల నిర్మాణాలతో పాటు నిత్య పూజలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గౌడ సంఘం సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి నాయకులు రమేష్‌యాదవ్, లోక్యానాయక్, నాగభూషణంగౌడ్, కాలిక్, రఫీ, చింతకింది. కాశయ్య, సిద్దు, కొరమండల్ సాయాగౌడ్ ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డీఎస్పీ

జుక్కల్ మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావును బాన్సువాడ డీఎస్పీ విఠల్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేను కలిసి ఆయన పుష్పగుచ్ఛం అందజేశారు.

ఆధ్యాత్మికం

ఘనంగా గంగమ్మతల్లికి బోనాలు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పోచారం గ్రామంలోగంగభవాని ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు సాంప్రదాయరీతిలో గంగబోనంతో బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు ఆలయానికి చేరుకొని అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. ఆయనవెంట ఎల్లారెడ్డి ఏఎంసీ చైర్‌పర్సన్ రజితరెడ్డి, కాంగ్రెస్ గ్రామకమిటీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, మాల్తుమ్మెద సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, యూత్‌కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీరాం గౌడ్ తదితరులున్నారు.

ముగిసిన శ్రీ వేంకటేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలు



రాజంపేట : మండల కేంద్రంలో శ్రీ వేంకటేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిసినట్లు ఆలయ సేవా సమితి సభ్యులు తెలిపారు. స్వామి వారి పవళింపు సేవతో బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు పేర్కొన్నారు. కుంభాజి నరేష్ చారి, చల్ల నర్సింలు, కమ్మరి నవీన్, నాగరాజు, జోగిపేట భాస్కర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భజన కీర్తనలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): సదాశివనగర్ సనాతన భజన మండలి ఆధ్వర్యంలో గాంధారి మండల కేంద్రంలో ప్రారంభమైన మార్కండేయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా భజన కీర్తనలు ఆలపించారు. గాంధారి మండల కేంద్రానికి చెందిన పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో భజన మండలి సభ్యులను సన్మానించి,జ్ఞాపికను అందజేశారు.

ఘనంగా చక్రతీర్థోత్సవం



మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం సేవా కాలం మూలమంత్ర హవనం మహా పూర్ణాహుతి, బలిహరణ, మహా కుంభసంప్రోక్షణ చక్రతీర్థోత్సవం నిర్వహించారు. తీర్థ ప్రసాద వితరణ అనంతరం మేళతాళాలతో స్వామివారిని ఊరేగింపుగా గ్రామ దేవాలయానికి రథంలో తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డి ఈవో శ్రీధర్ రావు వేద పండితులు ఆలయ అర్చకులు ఆలయ డైరెక్టర్లు సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నల్లమడుగులో ఘనంగా రథోత్సవం



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని నల్లమడుగు గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున హనుమాన్ ఆలయం వద్ద రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యుత్ దీపాలు, మామిడి తోరణాలు, రంగురంగుల పూలతో రథాన్ని అలంకరించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు.

మహిళలకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): కుట్టు శిక్షణ ద్వారా మహిళలకు ఉపాధి కల్పించడమే ప్రధాన లక్ష్యమని గ్రామస్వరాజ్య స్వచ్ఛంద సంస్థ జిల్లా కో–ఆర్డీనేటర్ వెంకట లక్ష్మి సూచించారు. మంగళవారం మండలంలోని కుప్రియాల్ గ్రామంలో సంస్థ ఆధ్వర్యంలో 30 రోజుల పాటు ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి, శిక్షణ ముగింపు సందర్భంగా ఆమె మాట్లాడారు. సంస్థ మండల కో–ఆర్డీనేటర్ భానుప్రియ, ఐకేపీ సీసీ అంజనేయులు, గ్రామ కార్యదర్శి సంతోష్ రెడ్డి,ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు, ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

నైపుణ్య శిక్షణ పొందిన మహిళలకు పరీక్షలు

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని దేవునిపల్లి విద్యుత్‌నగర్‌లో గల అక్షయ సంస్థలో రెండు నెలల పాటు టైలరింగ్, బ్యూటీపార్లర్ నైపుణ్య ఉచిత శిక్షణ పొందిన మహిళలకు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరీక్షల అధికారులు శ్రీధర్, అనిల్, గంగాదాస్, ఉపాధ్యాయులు సాహెరా బేగం, నాజ్మీన్, అక్షయ సంస్థ డైరెక్టర్ భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

వివాహానికి హాజరు కావాలని కేటీఆర్‌కు ఆహ్వానం

కామారెడ్డి క్రైం: బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్ రెడ్డి దంపతులు మంగళవారం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఈ నెల 18 న జరిగే తన కుమారుడు ఉదయ్ కిరణ్ రెడ్డి వివాహానికి హాజరు కావాలని కోరుతూ కేటీఆర్ తో పాటు ఎమ్మెల్సీ కవిత లకు వివాహ పత్రికలు అందజేశారు.

మైనారిటీ గురుకులంలో అడ్మిషన్లు ప్రారంభం

బిచ్కుంద(జుక్కల్) : మండల కేంద్రంలోని మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. ఆరో నుంచి పదో తరగతి వరకు బ్యాక్ లాగ్ భర్తీలు ఖాళీగా ఉన్నాయని. నాన్ మైనారిటీ విద్యార్థులు ఈనెల 14 నుంచి 18 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బెల్ట్‌షాపులను మూసేయించాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని నాగిరెడ్డిపేట గ్రామంలో కొనసాగుతున్న బెల్ట్‌షాపులను వెంటనే మూసివేయించాలని కోరుతూ మంగళవారం గ్రామానికి చెందిన పలువురు యువకులు పంచాయతీ కార్యదర్శి కార్తీక్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. బెల్ట్‌షాపులు కొనసాగడం వల్ల గ్రామంలో ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా మద్యం సేవిస్తున్నారని, దీంతో కుటుంబంలో తగాదాలు పెరిగిపోతున్నాయని వారు పేర్కొన్నారు. ఈ మేరకు బెల్ట్‌షాపుల నిర్వాహకులకు నోటీసులు జారీచేసి తగుచర్యలు చేపడతామని పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

భిక్కనూరు: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో అమ్మ ఒడి కార్యక్రమంను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు దివ్య 26మంది గర్భిణులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. ఎంపీహెచ్‌ఈవో వెంకరమణ, స్టాఫ్ నర్సు హరిత తదితరులు పాల్గొన్నారు.

46వ సారి రక్తదానం

కామారెడ్డి అర్బన్: పట్టణానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సంతోష్‌రెడ్డి మంగళవారం 46వ సారి రక్తదానం చేశారు. పట్టణానికి చెందిన చంద్రమౌళి హైదరాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో రక్తదానం చేశారు. ఈసందర్భంగా సంతోష్‌రెడ్డిని పలువురు అభినందించారు.